హైదరాబాద్ వరంగల్ జాతీయ రహదారిపై స్తంభించిన రాకపోకలు..



మహబూబాబాద్ జిల్లాలో వరదలో గల్లంతైన కారులోని అశ్విని మృతి.. ఫైల్ ఫోటో..




# పెన్ పవర్
## తెలంగాణ రౌండప్

సోమవారం 2 సెప్టెంబర్ 2024 పేజీలు 8


# తెలంగాణపై...జల ఖడ్గం



- స్తంభించిన రైళ్ళు, బస్సులు.. కొట్టుకుపోయిన కార్లు.. తెగిపోయిన కట్టలు..
- రాష్ట్రవ్యాప్తంగా తొమ్మిది మంది మృతి చెందినట్లు సమాచారం..
- మహబూబాబాద్ జిల్లాలో వరద ప్రవాహానికి గల్లంతైన కారు..
- కారులో తండ్రి నూనావత్ మోతీలాల్.. కూతురు నూనావత్ అశ్విని..
- లభించిన అశ్విని మృతదేహం.. మోతీలాల్ గురించి తెలియాల్సి ఉంది..
- వాగు మధ్యలో చిక్కుకుపోయిన ఆర్టీసీ బస్సు.. కాపాడమని వేడుకుంటున్న ప్రయాణికులు..
- హైదరాబాద్ వరంగల్ హైవేలో వరద నీరుతో రాకపోకలు నిలిచిపోయాయి..

-2లో



**మేడ్చల్ జిల్లా బ్యూరో, పెన్ పవర్, సెప్టెంబర్ 1:** తెలంగాణ వ్యాప్తంగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు తొమ్మిది మంది మృతిచెందగా..! రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మరోవైపు హైదరాబాదు మహానగరంతో పాటు తెలంగాణ పలుచోట్ల భారీగా ఆస్తి నష్టం, ప్రాణనష్టం సంభవించింది.. మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం పురుషోత్తమాయగూడెం వద్ద బ్రిడ్జిపై ప్రవహిస్తున్న వరద ప్రవాహంలో కారు కొట్టుకు పోయింది.. కారులో హైదరాబాద్ విమానాశ్రయానికి బయలుదేరిన ఖమ్మం జిల్లా సింగరేణి మండలం గేట్ కారేపల్లి గంగారం తండాకు చెందిన తండ్రి, కూతుర్లు గల్లంతయ్యారు..

మహబూబాబాద్ జిల్లా తాళ్ళపూసపెళ్ళి వద్ద వరదకు దెబ్బతిన్న రైల్వే ట్రాక్..



# జీడిమెట్లలో విషాదం..
## ఇద్దరు పిల్లలను చంపి. దంపతుల ఆత్మహత్య



**జీడిమెట్ల, పెన్ పవర్, సెప్టెంబర్ 1:** జీడిమెట్ల హైదరాబాద్‌లోని జీడిమెట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో విషాదం చోటుచేసుకుంది. గాజుల రామారంలోని ఓ అపార్ట్‌మెంట్‌లో ఇద్దరు పిల్లలను చంపి దంపతులు ఆత్మహత్య చేసుకున్నారు. మృతులను భార్యాభర్తలు వెంకటేశ్ (40), వర్షిణి (33), వారి పిల్లలు రిషికాంత్(11), విహంత్ (3)గా గుర్తించారు. వీరి స్వస్థలం మంచిర్యాల. పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. ఆర్థిక ఇబ్బందులతోనే దంపతులు తమ పిల్లలను చంపి ఆత్మహత్యకు పాల్పడినట్లు ప్రాథమికంగా నిర్ధరించారు.

# కట్టుకాలువపై.. 30 అక్రమ నిర్మాణాలు..

- దుండిగల్-కాజీపల్లి సరిహద్దులో కట్టుకాలువ కనుమరుగు..
- సమస్య పరిష్కారం తాత్కాలికమే..! త్వరలో పాత నాలా పునరుద్దరణకు చర్యలు..

- మల్లంపేట్ కత్వ చెరువులోకి, భారీ ఇటాచ్చీతో తాత్కాలికంగా వర్షపు నీరు మళ్ళింపు..
- ఆదివారం “పెన్ పవర్” వార్తా కథనంతో స్పందించిన మున్సిపల్, ఇరిగేషన్ అధికారులు..
- మత్స్యకారులతో కమిషనర్ కె.సత్యనారాయణ, ఇరిగేషన్ డీఈఈ శ్రీనివాస్ పాల్గొన్నారు..

-3 లో



- రెండు మండలాల నడుమ 5-6 కిలోమీటర్ల మేరకు కట్టుకాలువ పూడ్చేసినట్లు గుర్తించిన అధికారులు..
- కట్టుకాలువ కబ్జా విషయాన్ని పై అధికారుల దృష్టికి తీసుకెళ్ళామన్న ఇరిగేషన్,మున్సిపల్..

# తెలంగాణపై.. జల ఖడ్గం..



వాగులో చిక్కుకుపోయిన బస్సు..








## వాగు మధ్యలో ఆర్టీసీ బస్సు..

మహబూబాబాద్ నెక్కొండ మండలం వెంకటాపురం గ్రామ చెరువు ఒక్కసారిగా ఉప్పొంగడంతో ఆర్టీసి బస్సు వాగు వరదలో చిక్కుకుపోయింది.. సుమారు 10 గంటలుగా రాత్రి మొత్తం బస్సులోనే ఉన్నామని.. తమను కాపాడాలంటూ బంధువులను, అధికారులను ప్రయాణికులు వేడుకుంటున్నారు..



- మొదటి పేజి తరువాయి

తమ కారు పోయిందని, మెడవరకు నీరు ప్రవహిస్తుందని బందువులకు పోన్‌లు చేసిన నూనావత్ మోతిలాల్, నూనావత్ అశ్విని, ఆతర్వాత ఫోన్‌లు స్విచ్ ఆఫ్ అయినట్లు బంధువులు పేర్కొన్నారు..అనంతరం నూనవత్ అశ్విని మృతదేహం లభించడంతో కుటుంబ సభ్యులు శోక సముద్రంలో ఉన్నారు.. తండ్రి జాడ ఇంకా లభించలేదు..

## రైళ్ళు నిలిపివేత.. ప్రయాణికులకు ఇబ్బందులు..

రాష్ట్ర వ్యాప్తంగా కురుస్తున్న భారీ వర్షాలకు మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం తాళ్లపూసపెల్లి శివారు రైల్వే ట్రాక్, నెక్కొండ-ఇంటికన్నె మధ్యలో ఉన్న ట్రాక్‌పై వరద నీరు ప్రవహించడంతో రైల్వే ట్రాక్ క్రింద ఉన్న కంకర కొట్టుకు పోవడంతో రైళ్ళను ఎక్కడికక్కడే నిలిపివేశారు.. దీంతో మహబూబాబాద్ వరంగల్ డోర్నకల్ తదితర రైల్వే స్టేషన్లలో పలు రైళ్లను నిలిపివేశారు..రైల్వే స్టేషన్‌లో నిలిచిపోయిన ప్రయాణికులకు వాసవి, వర్తక సంఘం, శ్రీ సత్య సాయి సేవా ట్రస్ట్, మార్వాడి సంఘం, తదితరులు కలిసి వాటర్ బాటిల్స్, బిస్కెట్స్ ,అల్పాహారం అందించారు..

## ఉమ్మడి వరంగల్ జిల్లాలో మృత్యువాత.. హైవేలు దిగ్బంధం..

ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగాహోభారీ వర్షాలకు ప్రమాదవశాత్తు నలుగురు మృతి చెందినట్లు తెలుస్తుంది..జిల్లాలోని వేర్వేరు ప్రాంతాల్లో వరదల్లో చిక్కుకొని ముగ్గురు మృతి చెందగా విద్యుత్ షాక్‌తో మరొకరు మృతి.. మహబూబాబాద్ జిల్లా వెంకటాపురంలో చేపల వేటకు వెళ్లిన గుండాల నర్సయ్య మృత్యువాత పడ్డాడు.. వరంగల్ జిల్లా గిర్నిబావి వాగులో చిక్కుకొని వజ్రమ్మ అనే మహిళ మృతి చెందింది.. ములుగు జిల్లా కాల్వపల్లి వాగులో పడి పశువులకాపరి మల్లికార్జున్ మృతి.. హనుమకొండ జిల్లా పరకాలలో విద్యుత్ షాక్‌తో యాదగిరి అనే వ్యక్తి మృతి చెందారు.. వరంగల్ జిల్లా కాట్రపల్లిలో పాత ఇల్లుకూలి యాకూబ్, నరసయ్య అనే ఇద్దరికి తీవ్ర గాయాలతో ఆసుపత్రికి తరలించారు..



# లైవ్‌లో కన్నీరు పెట్టిన మంత్రి పొంగులేటి



**హైదరాబాద్ పెన్ పవర్:**మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కన్నీరు పెట్టుకున్నారు. ఖమ్మం జిల్లాల్లో మున్నేరు వాగులో చిక్కుకున్న కుటుంబ పరిస్థితిని వివరిస్తూ..లైవ్ లో కన్నీ రు పెట్టుకున్నారు. ఖమ్మంలోని ప్రకాశ్ నగర్ లో ఓ బ్రిక్స్ తయారీ యూనిట్ నిర్వహిస్తున్న నిరుపేద కుటుంబం మున్నేరు వాగు వరదల్లో చిక్కుకుంది..వరద ప్రవా హం చుట్టుముట్టిన ఇంటిపై బిక్కుబిక్కుమంటూ సాయం కోసం ఎదురు చూస్తున్నారు.

బాధితులతో మాట్లాడిన పొంగులేటి.. వారికి ధైర్యం చెప్పారు. హెలికాప్టర్లు పంపించేందుకు ప్రయత్నించారు.. కానీ వాతావరణ సహకరించకపోవడంతో సాధ్యం కాలేదు.. అయితే డ్రోన్ ద్వారా బాధితులకు సేఫ్టీ జాకెట్లు పంపించారు.

అయితే ఇంతలోనే వరద ఉధృతి పెరిగి ఇంటి గోడ కూలిపోయిందని మంత్రి పొంగులేటి మీడియాతో చెప్పారు.. లైఫ్ జాకెట్లు ఉన్నాయి.. వారు క్షేమంగా బయటికి రావాలని కోరుకుంటున్నానని కంటనీరు పెట్టుకున్నారు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి.

కత్వ చెరువు కట్టుకాలువ పునరుద్దరణలో అధికారులతో మత్స్యకారులు..



- మల్లంపేట్ కత్వ చెరువులోకి, భారీ ఇటాచ్చీతో తాత్కాలికంగా వర్షపు నీరు మళ్ళింపు..
- ఆదివారం "పెన్ పవర్" వార్తా కథనంతో స్పందించిన మున్సిపల్, ఇరిగేషన్ అధికారులు..
- మత్స్యకారులతో కమిషనర్ కె.సత్యనారాయణ, ఇరిగేషన్ డీఈఈ శ్రీనివాస్ పాల్గొన్నారు..
- రెండు మండలాల నడుమ 5-6 కిలోమీటర్ల మేరకు కట్టుకాలువ పూడ్చేసినట్లు గుర్తించిన అధికారులు..
- కట్టుకాలువ కబ్జా విషయాన్ని పై అధికారుల దృష్టికి తీసుకెళ్ళామన్న ఇరిగేషన్,మున్సిపల్..

# కట్టుకాలువపై... 30 అక్రమ నిర్మాణాలు

పెన్ పవర్ EXCLUSIVE ఎఫెక్ట్

## దుండిగల్-కాజీపల్లి సరిహద్దులో కట్టుకాలువ కనుమరుగు..
## సమస్య పరిష్కారం తాత్కాలికమే..! త్వరలో పాత నాలా పునరుద్దరణకు చర్యలు..





మేడ్చల్ జిల్లా బ్యూరో, పెన్ పవర్, సెప్టెంబర్ 1:

హైదరాబాదు మహానగరంలోని చెరువుల కబ్జాలు దశాబ్ద కాలం ఆక్రమణకు గురైనవి.. ఒక్క రోజులో పరిష్కృతం కాక పోవచ్చు కానీ..! ప్రయత్నం చేస్తే సాధించవచ్చు.. అనాలోచితంగా గత ప్రభుత్వం అధికారికంగా తీసుకున్న తప్పుడు నిర్ణయాలు నగరం చెరువులకు గండంగా తయారైంది.. కొందరు నేతలు స్వార్ధ పూరితంగా అక్రమ లేఅవుట్‌లను ప్రోత్సహించి, చెరువులు అంతరించి పోయేందుకు ప్రధాన కారణం.. లేక్ వ్యూల పేరుతో రూ. కోట్లు దండు కోవడానికి ప్రజా ఆస్తులకు ఎసరు పెట్టారు సమిష్టి కృషి ఉందని చెప్పవచ్చు.. చెరువు దిగువ భాగంలో ఒక వెంచర్..! చెరువు ఎగువ భాగంలోమరొక వెంచర్‌లు వేసి..! చెరువులోకి రావాల్సిన కట్టుకాలువలు అనధికారికంగా మూసివేసి నీళ్ళు రాకుండా పథకం వేశారు.. మరొక దారుణమైన సంఘటన (స్వయంగా అధికారులు చెప్పిందే).. వ్యవసాయ భూములు, వెంచర్‌లుగా అవతరిస్తున్న కారణంగా చెరువు "తూము కాలువ"లు అవసరం లేదని భావించి గత ప్రభుత్వాల హయాంలో తూములను కాంక్రీట్‌తో మూసివేశారు సరే..! కనీసం తూము కాలువలు కబ్జాకు గురికాకుండా కాపాడారా..? అంటే అదీ లేదు.. అక్రమార్కులకు అప్పగించారు.. ప్రస్తుతం బడా నిర్మాణ సంస్థల ఆధీనంలో సదరు నాలాలపై విల్లాలు నిర్మితమై ఉన్నాయి.. లి

తెలంగాణ వ్యాప్తంగా విస్తారంగా కురుస్తున్న భారీ వర్షాలకు ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నది చూస్తున్నం.. చెరువులు, కాలువలు తెగిపోయి, వరద తాకిడి ఘటనలతో రోడ్లు, రైల్వే ట్రాక్‌లు దెబ్బతిని, ఎక్కడికక్కడ రైళ్ళు, బస్సులు స్తంభించి పోయాయి.. ఈ నేపథ్యంలో కూడా మేడ్చల్ జిల్లా దుండిగల్ మండలం మల్లంపేట్ కత్వ చెరువు లేక్ఐడి నెం:2830 చెరువు 130 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న చెరువులోకి సుక్క నీరు రాకపోవడంతో మత్స్యకారులు ఆందోళన చెందారు.. చెరువులోకి రావాల్సిన కట్టుకాలువలు కబ్జాకు గురైనట్లు గుర్తించిన స్థానికులు సంబంధిత అధికారులకు, శనివారం ఫిర్యాదు చేశారు.. స్థానికుల ఫిర్యాదుతో "పెన్ పవర్" దినపత్రికలో ఆదివారం "మల్లంపేట్ కత్వ చెరువు ఖతం.. నీళ్ళు రాకుండా పూడ్చేసిశారు.. అన్న వార్తా కథనానికి ఇరిగేషన్, మున్సిపల్ అధికారులు స్పందించారు.. వెంటనే ఆదివారం ఉదయం నుండి చర్యలు ప్రారంభించి తాత్కాలికంగా సమస్యకు పరిష్కారం చూపారు..



మల్లంపేట్ వరద కాలువ పనుల్లో కమిషనర్ సత్యనారాయణ..

### వరద కాలువపై 30-40 కట్టడాలు ఉన్నట్లు గుర్తింపు..

మల్లంపేట్ కత్వ చెరువు లేక్ఐడి నెం:,2830 చెరువులోకి వచ్చే వరద కాలువను పూడ్చేసి, నాలాపై అక్రమ కట్టడాలు చేపట్టినట్లు అధికారులు గుర్తించారు.. ఈ విషయాన్ని పై అధికారుల దృష్టికి తీసుకెళ్ళనున్నట్లు తెలిపారు.. బీజేపీ నేత ఎంబరి ఆంజనేయులు, మత్స్యకారులతో కలిసి శనివారం ఫిర్యాదు, పెన్ పవర్ దినపత్రికలో వచ్చిన కథనంపై మున్సిపల్,ఇరిగేషన్ అధికారులు స్పందించారు.. ఆదివారం మల్లంపేట్ కత్వ చెరువుకు వచ్చే వరద నీరు ప్రవహించే నాలాను కమిషనర్ కె.సత్యనారాయణ అండ్ సిబ్బంది, నీటిపారుదల శాఖ డీఈఈ శ్రీనివాస్, ఏఈ సారా కత్వ చెరువు వద్దకు భారీ ఇటాచ్చీతో చేరుకున్నారు.. రెండు మండలాల సరిహద్దులో ఉన్న వరద కాలువను కబ్జాచేసి అక్రమ నిర్మాణాలు చేపట్టినట్లు గుర్తించారు.. మల్లంపేట్- కాజీపల్లి మధ్యలో ఉన్న కట్టుకాలువను పూడ్చేసి, సుమారు 30 నుండి 40 నిర్మాణాలు చేపట్టినట్లు అధికారులు గుర్తించారు.. దీంతో శాశ్వత పరిష్కారానికి కొంత సమయం పడుతుందని..! ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్ళి, ప్రణాళిక బద్దంగా చర్యలు చేపట్టాలన్నారు.. తాత్కాలికంగా నాలాను పునరుద్ధరించారు..

- మిగతా 4లో...

# కట్టుకాలువపై.. 30 అక్రమ నిర్మాణాలు..


పెన్ పవర్
1 ఆదివారం, సెప్టెంబర్ 2024 పెన్ పవర్ తెలంగాణ రౌండప్ TELANGANA ROUNDUP 3

మల్లంపేట్ కత్వ చెరువు ఖతం.. నీళ్ళు రాకుండా పూడ్చేశారు..

ఎనభై నాలుగు కుటుంబాల మత్స్యకారుల జీవనోపాధికి ముప్పు..


నాలా కబ్జాకు గురికావడంతో తాత్కాలికంగా రోడ్డు పక్కనుండి నీరు వెళ్ళే విధంగా ఇలా..

## అధికారులతోనే రోజంతా మత్స్యకారులు..

కట్టుకాలువ పునరుద్దరణ పనుల్లో భాగంగా మున్సిపల్, ఇరిగేషన్ అధికారులతో కలిసి మత్స్యకారులు దగ్గరుండి నాలా పనులను చూసుకున్నట్లు బీజేపీ నేత ఎంబరి ఆంజనేయులు పెన్ పవర్ తో ప్రస్తావించారు.. ఈ విషయంపై స్థానిక కౌన్సిలర్ అనంత స్వామి బీజేపీ నాయకులు ఎంబరి ఆంజనేయులు ముదిరాజ్, ముదిరాజ్ సంఘం అధ్యక్షులు రమేష్, మాజీ అధ్యక్షులు తలారి కృష్ణ, సూరారం కృష్ణ, గోపాల్, గాండ్ల శ్రీనివాస్, జి మల్లేష్, కోటేష్, బిక్షపతి పాల్గొన్నారు.. నాలా పునరుద్దరణ పనులు ఉదయం 7 గంటల నుండి పనులు చేయించినట్లు తెలిపారు.. ఎలాగైతే నేమి కత్వ చెరువులోకి వరద నీరు చేరేవిధంగా సమస్య పరిష్కృతం అయిందని ఎంబరి ఆంజనేయులు పేర్కొన్నారు..

## కత్వ చెరువుకు ఉన్న రెండు తూములు మూసేశారు..

కత్వ చెరువుకు సంబంధించిన రెండు తూములు ఉన్నాయని తెలిపారు..! సంబంధిత తూములను కొందరు నేతల సహకారంతో, వెంచర్ నిర్వాహకులకు అడ్డ రాకుండా మూసివేశారని మత్స్యకారులు ఆరోపించారు.. ఇరిగేషన్ టోపోషీట్ ప్రకారం తూము కాలువ, వర్షపు వరద నీరు ప్రవహించే విధంగా దాదాపు 45 ఫీట్ల విస్తీర్ణంలో ఉంటుందని..! చెరువు 130 ఎకరాలవిస్తీర్ణంలో ఉన్నప్పటికీ..! అధిక వర్షపాతానికి నీటిమట్టం పెరిగితే..! తూముల ద్వారా నీటిని బయటకు పంపించే విధంగా విశాలంగా నాలాలు ఉండేవని మత్స్యకారులు పేర్కొన్నారు.. ప్రస్తుతం చెరువు తూములు అధికారికంగా మూసివేసి, సదరు నాలా స్థలాలపై విల్లాలు నిర్మించారని స్థానికులు, మత్స్యకారులు ఆరోపించారు.. చెరువు తూములు మూసివేసిన కారణంగా కట్ట తెగిపోయే ప్రమాదం ఉందని భయాందోళన చెందుతున్నారు..

## హైడ్రా కమిషనర్‌కి మత్స్యకారుల విజ్ఞప్తి..

దుండిగల్ మండలంలోని చెరువుల తూము కాలువలు పునరుద్దరణ గావించాలని "హైడ్రా" కమిషనర్ ఏవి రంగనాథ్‌ని వేడుకున్నారు.. బీజేపీ నేత మత్స్యకారుడు ఆంజనేయులు ముదిరాజ్ మాట్లాడుతూ.. మండలంలోని ప్రతి చెరువుకి సంబంధించిన తూము నాలాలను..! గతంలో మూసివేశారని, అందుకే చెరువుల్లోకి "ఇన్‌ఫ్లో ఔట్‌ఫ్లో" లేకపోవడం మురికికూపంగా తయారై చేపలు పెంచలేక పోతున్నామని మీడియా ద్వారా తెలిపారు.. హైడ్రా కమిషనర్ రంగనాథ్, జిల్లా కలెక్టర్ గౌతమ్, ఇరిగేషన్ ఉన్నతాధికారులు చెరువులను సందర్శించి, తూము నాలాలు పునరుద్దరించాలని విజ్ఞప్తి చేశారు.. చెరువు నాలాల పునరుద్దరణతో స్వచ్ఛమైన నీరుతో పాటు, ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పించవచ్చని అన్నారు..

# 80 రైళ్ల రద్దు.. ప్రయాణికులకు దక్షిణ మధ్య రైల్వే బిగ్ అలర్ట్

**హైదరాబాద్ పెన్ పవర్:** బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా రెండు తెలుగు రాష్ట్రాల్లో కుండపోత వర్షం కురుస్తోంది. గత మూడు రోజులుగా నాన్ స్టాప్‌గా వర్షం కురుస్తుండటంతో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో జనజీవనం స్తంభించిపోయింది. భారీ వర్షం, వరదలకు రోడ్లు నదులను తలపిస్తుండటంతో రవాణ రంగం అతలాకుతలం అయ్యింది. కొన్ని చోట్ల రోడ్లపైకి భారీగా వరద నీరు చేరగా.. మరి కొన్ని చోట్ల వరద ఉధృతికి ఏకంగా రోడ్లే కొట్టుకుపోయాయి.

వర్షాల ప్రభావం రైల్వే వ్యవస్థపైన పడింది. పలు ప్రాంతాల్లో వరదకు రైల్వే పట్టాలు కొట్టుకుపోయాయి. దీంతో దక్షిణ మధ్య రైల్వే భారీగా రైళ్లను రద్దు చేసింది. తెలుగు రాష్ట్రాల మీదుగా వెళ్లే 80పైగా రైళ్లను రద్దు చేస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే అధికారులు వెల్లడించారు. కొన్నింటిని దారి మళ్లించడంతో పాటు మరికొన్నింటిని తాత్కాలికంగా రద్దు చేసినట్లు తెలిపారు. రైళ్ల రద్దుపై ద.మ రైల్వే సీపీఆర్ఓ శ్రీధర్ స్పందించారు.రైల్వే నిలయం డిజాస్టర్ మేనేజ్మెంట్ కంట్రోల్ రూం నుంచి పరిస్థితులను పర్యవేక్షిస్తున్నామని ఆయన తెలిపారు.



ప్రయాణికులు ఎవరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని.. ప్యాసింజర్ల భద్రత కోసమే రైళ్ళను రద్దు చేస్తున్నామని పేర్కొన్నారు. ఆర్టీసీ బస్సులు, రాష్ట్ర ప్రభుత్వం సహాయంతో ప్రయాణికులకు ఇబ్బందులు రాకుండా చూస్తున్నామని తెలిపారు. వర్షాలు తగ్గిన తర్వాత ట్రాక్ పునరుద్దణ పనులు చేపడతామని స్పష్టం చేశారు. కాగా, భారీ వర్షాల వల్ల మహబూబాబాద్ జిల్లాలో రైల్వే ట్రాక్ కొట్టుకుపోవడంతో ఏపీ, తెలంగాణ మధ్య రైళ్ల రాకపోకలు తీవ్ర అంతరాయం అయిన విషయం తెలిసిందే.

### రద్దైన రైళ్ల వివరాలు

విజయవాడ – సికింద్రాబాద్
సికింద్రాబాద్ – విజయవాడ
గుంటూరు – సికింద్రాబాద్
సికింద్రాబాద్ – సిర్పూర్ కాగజ్ నగర్
కాకినాడ ఫోర్ట్ – లింగపల్లి,
గూడూరు – సికింద్రాబాద్,
భద్రాచలం – బల్హార్ష
బల్హార్ష– కాజీ పేట్
భద్రాచలం – సికింద్రాబాద్
సికింద్రాబాద్ – భద్రాచలం
కాజీ పేట – డోర్నకల్
హైదరాబాద్ – షాలిమర్
సికింద్రాబాద్ – విశాఖ పట్నం
విశాఖ పట్నం – సికింద్రాబాద్
హౌరా – సికింద్రాబాద్ ,
సికింద్రాబాద్ – తిరువనంతపురం ,
తిరువనంతపురం – సికింద్రాబాద్ ,
మహబూబ్ నగర్ – విశాఖ పట్నం,
లింగంపల్లి – %జమీ% ముంబాయి,
%జమీ% ముంబాయి – లింగంపల్లి,
కరీంనగర్ – తిరుపతి

# హైదరాబాద్‌కి వరద విపత్తు..








నిజాంపేట్ ఎన్నారై కాలనీ, శ్రీరంగ లైన్ ప్రగతి నగర్‌లో ప్రతి సంవత్సరం వర్షాకాలం అపార్ట్మెంట్లను వరదనీరు ముంచి వేస్తుందని.. తెలుగు యూనివర్సిటీ నుండి ఒకనాల కె.జి.ఆర్ కన్వెన్షన్ మీదుగా మరొకనాల తురుక చెరువులోకి రావాలి. కనీసం గత సంవత్సరం మోక్షిత్ రెడ్డి బాబు నాలలో పడి చనిపోయిన అధికారులకి ప్రజాప్రతినిధులకి ఇంకా నిద్ర మేల్కొనలేదని బీజేపీ నేతల ఆరోపణ.. వర్షంలో బాచుపల్లి పోలీస్ అధికారులు విధుల నిర్వహణ..

## వర్షం వల్ల ప్రజలకు ఇబ్బందులు కలగకుండా జిహెచ్ఎంసి చర్యలు చేపట్టాలి.

### ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి








**మేడ్చల్ జిల్లా బ్యూరో పెన్ పవర్ సెప్టెంబర్ 1** కురుస్తున్న వర్షాలతో నియోజకవర్గం పరిధిలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిరంతరం అప్రమత్తంగా ఉండాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి జిహెచ్ఎంసి అధికారులను ఆదేశించారు.

కుషాయిగూడ డి మార్ట్ ఎదురుగా గత రెండు నెలలు కాలంగా ప్రధాన రహదారిపై పొంగుతూ శివ సాయి నగర్ వీధులను ముంచెత్తున్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ లైన్ కాలువను కాప్రా సర్కిల్ డిప్యూటీ కమీషనర్ జగన్ సర్కిల్ ఇంజనీరింగ్ ఈ ఈ హరిలాల్, ఏ కీర్తి తదితరుల తో కలిసి పరిశీలించారు.

జోరున కురుస్తున్న వర్షంలో శివ సాయి నగర్, నాగార్జున నగర్ ఫేస్ 1, సాయి మిత్ర టవర్స్, వి.ఎన్.రెడ్డి నగర్ తదితర కాలనీల ప్రతినిధులతో కలిసి పొంగుతున్న అండర్ గ్రౌండ్ మురుగు కాల్వలను పాడైన రోడ్లను కాలినడకన తిరుగుతూ పరిశీలించారు.

యుద్ధ ప్రాతిపదికన పక్కాగా చర్యలు చేపట్టాలని డిప్యూటీ కమిషనర్ జగన్ ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో చర్లపల్లి కాలనీల సమాఖ్య సిసిఎస్ ప్రతినిధులు నాయకులు ఎంపల్లి పద్మా రెడ్డి, నేమూరి మహేష్ గౌడ్, సారా అనిల్ ముదిరాజ్, నా రెడ్డి రాజేశ్వర్ రెడ్డి, పనగట్ల చక్రపాణి గౌడ్, తాళ్ల వెంకటేష్ గౌడ్, చల్లా వెంకటేష్, నరసింహారెడ్డి, లక్ష్మీనారాయణ, రామ్ రెడ్డి, బర్ల రామచంద్రారెడ్డి, కొండగళ్ల అశోక్, నారా నర్సింహులు, రాజు, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఎడతెరపిలేని వర్షాలు ... నేలకొరిగిన భారీ వృక్షాలు

### కాలనీల్లో పర్యటించిన చైర్మన్ చంద్రారెడ్డి




**మేడ్చల్ జిల్లా బ్యూరో పెన్ పవర్ సెప్టెంబర్ 1** రెండు రోజులుగా ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలకు నాగారం మున్సిపాలిటీలో పలు కాలనీలలో వరద నీరు వచ్చి చేరడంతో.. స్థానికులు ఇళ్ల నుంచి బయటకు రాని పరిస్థితి ఏర్పడింది. భారీ వర్షాల నేపథ్యంలో లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. నాగారం మున్సిపాలిటీ లోని పోచమ్మ ఆలయం వద్ద భారీ (40 సంవత్సరాల) వృక్షం నెలకొరిగింది. విద్యుత్ స్తంబాలు విరిగి విద్యుత్ అంతరాయం ఏర్పడింది. పలు కాలనీలలో చెట్లు విరిగిపడ్డాయి. నాగారంలోని విశాల్ మార్ట్ వద్ద ప్రధాన రహదారిపై మోకాళ్ళ లోతు వరద నీరు ప్రవహిస్తుంది.

**వరద ప్రాంతాలలో చైర్మన్ చంద్రారెడ్డి పర్యటన..**

రెండు రోజులుగా ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలకు నాగారం మున్సిపాలిటీలో పలు కాలనీలలో వరద నీరు వచ్చి చేరడంతో.. వరద ప్రాంతాలను మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి కమిషనర్ జి. రాజేంద్ర కుమార్ తో కలిసి ఆదివారం పర్యటించారు. ఈ భారీ వర్షాలలో పడిపోయిన చెట్లను, విరిగిపోయిన స్తంభాలను పరిశీలించి మరమ్మతుల కోసం మున్సిపల్ చైర్మన్ కౌకుంట్ల చంద్రారెడ్డి అధికారులను ఆదేశించారు. ఈ పరిశీలనలో మున్సిపల్ చైర్మన్ మాట్లాడుతూ.. భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలనీ, ఎమర్జెన్సీ కోసం 9640010053 నెంబర్కు ఫోన్ చేయగలరని కోరారు. ఈ పరిశీలనలో మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.



## వరంగల్ -హైదరాబాద్ హైవేపై భారీగా వరద. .5 కిలో మీటర్లు ట్రాఫిక్ జామ్




**హైదరాబాద్ పెన్ పవర్:**రాత్రి నుంచి జనగామ జిల్లాలో తెంపు లేకుండా వర్షం పడుతోంది. దీంతో చెరువులు నిండుకుండల్లా మారియి. రహదారులు తెగిపోవడంతో పలు గ్రామాలకు రాకపోకలు బంద్ అయ్యాయి. భారీ వర్షానికి రఘునాథ్ పల్లి దగ్గర వరంగల్ %-%హైదరాబాద్ హైవేపై భారీగా వరద నీరు చేరింది. హైదరాబాద్-వరంగల్ జాతీయ రహదారిపై రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. 5 కిలో మీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. %ఐజూ% రాజమహేంద్ర నాయక్ ఆధ్వర్యంలో సహాయక చర్యలు చేపట్టారు అధికారులు.

మరోవైపు జనగామ నుంచి హుస్నాబాద్ వెళ్లే రూట్లోని గానుపహాడ్ దగ్గర నిర్మాణంలో ఉన్న బ్రిడ్జి కూలిపోయింది. తాల్కాలికంగా వేసిన మట్టి రోడ్డు కొట్టుకుపోవడంతో రాకపోకలు నిలిచిపోయాయి. అటు జనగామ నుంచి పాలకుర్తి వెళ్లే రహదారి కుందారం దగ్గర మట్టిరోడ్డు కొట్టుకుపోయింది. చీటకొడూరు రిజర్వాయర్ కు వరద నీరు చేరడంతో నిండుకుండలా మారింది. భారీ వర్షాలతో జనగామ కలెక్టరేట్లో టోల్ ఫ్రీ నంబర్ ఏర్పాటు చేశారు. అధికారులెవరూ సెలవుల్లో ఉండొద్దని జనగామ కలెక్టర్ రిజ్వాన్ బాషా అధికారులకు సూచించారు. లోతట్టు ప్రాంతాల ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అలర్ట్ ఉండాలన్నారు.

## కోదాడలో కొట్టుకొచ్చిన కారులో మృతదేహం



**హైదరాబాద్ పెన్ పవర్:**సూర్యాపేట జిల్లా కోదాడలో వాన బీభత్సం సృష్టించింది. ఇప్పటికే పట్టణంలోని చాలా ఏరియాలు నీట మునిగాయి. వరద నీటిలో కొట్టుకొచ్చిన కారులో ఓ మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. పోలీసులకు సమాచారం అందించారు. కోదాడ మున్సిపాలిటీలోని భారతి పబ్లిక్ స్కూల్ దగ్గర ఉన్న కాలువలో రెండు కార్లు కొట్టుకొచ్చాయి. కారులో ఒకరు చనిపోయాయి ఉన్నారు. గాంధీ నగర్ కు చెందిన నాగం రవి మృతుడిగా పోలీసులు గుర్తించారు. నాలాలో ఉన్న కార్లను క్రేన్ సాయంతో బయటకు తీశారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. నిన్నటి నుంచి ఎడతెరిపిలేకుండా కురుస్తున్న భారీ వర్షాలతో సూర్యాపేట జిల్లా కోదాడ టౌన్ జలదిగ్భంధంలో చిక్కుకుంది. ఏ కాలనీలో చూసినా వరద నీరే కనిపిస్తోంది. ఇతర ప్రాంతాల నుంచి కోదాడకు రాకపోకలు బంద్ అయ్యాయి. హుజుర్ నగర్ రోడ్డులో పక్కన ఉన్న కాలువలో గల్లంతు అయ్యాడు ఓ వ్యక్తి. గాలింపు చర్యలు చేపట్టిన సిబ్బంది. నిన్నటి నుంచి పట్టణంలో కరెంట్ లేకపోవడంతో జనం ఇబ్బందులు పడుతున్నారు. ళ్లు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామంటున్నారు ప్రజలు. పట్టణంలోని వరద ప్రభావిత ప్రాంతాలను సందర్శించారు సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్, ఆర్డీవో సూర్యనారాయణ. ప్రజలకు ఇబ్బందులు కల్గకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

# రోడ్డుకు మట్టి పోసి సమస్యను పరిష్కరించండి...కొండ జంగారెడ్డి







రోడ్డు చిత్తడి, చిత్తడిగా కావడంతో వానదారులు ఇబ్బందులు

మట్టిలో కృంగిపోయిన స్కూల్ బస్సు



**మేడ్చల్ జిల్లా బ్యూరో పెన్ పవర్ సెప్టెంబర్ 01** రోడ్డుకు ఇరువైపులా మట్టిని పోసి.. సమస్యను పరిష్కరించాలని నాగారం మున్సిపాలిటి తెదేపా పార్టీ అధ్యక్షుడు కొండ జంగారెడ్డి తెలిపారు. నాగారం మున్సిపాలిటీ పరిధిలో 5, 6వ వార్డులోని లోటస్ కాలనీ నుండి శిల్పనగర్ వెళ్లే దారిలో బాక్స్ డ్రైనేజీ పనులు చేపట్టి ఈ మధ్య కాలంలోనే పూర్తి చేశారు. బాక్స్ డ్రైనేజీ కు ఇరుపక్కల మట్టి పోయకపోవడం వల్ల వర్షం పడినప్పుడుల్లా చిత్తడి, చిత్తడిగా మారి ప్రయాణికులు, వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. అదే కాలనీలో రెండు స్కూలు ఉండడం వల్ల రోజు స్కూల్ బస్సులు, వాహనాలు వందల సంఖ్యలో రాకపోకలు సాగిస్తుంటాయి. బాక్స్ డ్రైనేజీ ఇరుపక్కల మట్టి కృంగిపోయి వాహనాలు దిగబడిపోవడంతో వాహనాలు నిలిచిపోయి ట్రాఫిక్ అంతరాయం ఏర్పడుతుందన్నారు. ఇదే విషయమై మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేస్తే రెండు మూడు రోజులలో సమస్యను పరిష్కరిస్తామని చెప్పి నెల రోజులైనా సమస్యకు పరిష్కారం చూపలేదని అన్నారు. ఇప్పటికైనా సమస్యను పట్టించుకొని త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను, పాలకవర్గాన్ని కోరారు.

# ఖమ్మంలో వరద బీభత్సం

### ఉమ్మడి ఖమ్మం జిల్లాలో కుండపోత వర్షాలు

### ఖమ్మంలో జలాశయాలుగా మారిన పలు కాలనీలు

### నీట మునిగిన పలు ఇళ్లు



**హైదరాబాద్ పెన్ పవర్:**భారీ వర్షాలు తెలంగాణను అతలాకుతలం చేస్తున్నాయి. కుండపోత వర్షాల కారణంగా ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని పలు ప్రాంతాలు నీటమునిగాయి. ఖమ్మం నగరంలో వరద బీభత్సం సృష్టిస్తోంది. పలు కాలనీలు జలాశయాలుగా మారాయి. ఎన్నో ఇళ్లు నీట మునిగాయి. ఖమ్మంలోని రాజీవ్ గృహకల్ప కాలనీ, వెంకటేశ్వర నగర్, గణేశ్ నగర్ తదితర ప్రాంతాలను మున్నేరు వరద ముంచెత్తింది. తమను కాపాడాలంటూ వరద నీరు చుట్టుముట్టిన ఇళ్ల నుంచి బాధితులు ఆర్తనాదాలు చేస్తున్నారు. ఇంటిపైకి ఎక్కి సాయం కోసం ఎదురు చూస్తున్నారు.

## అన్ని డిపార్ట్ మెంట్లను అప్రమత్తం చేశాం : ఆమ్రపాలి



**హైదరాబాద్ పెన్ పవర్:**భారీ వర్షాల వల్ల జీహెచ్ఎంసీ పరిధిలో ఉద్యోగులకు సెలవులను రద్దు చేశామన్నారు జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి. జోనల్ కమిషనర్లు 24 గంటలు రోడ్లపైనే ఉంటున్నారని చెప్పారు. %ఎ%6 న్యూస్ ఛానల్ తో మాట్లాడిన ఆమె.. ప్రాణనష్టం జరగకుండా అన్ని ఏర్పాట్లు చేశామని చెప్పారు. హైదరాబాద్ లో రెండు రోజుల నుంచి విపరీతంగా వర్షం కురుస్తోందని.. ఎక్కడ సమస్య లేకుండా అన్ని విభాగాల సమన్వయంతో చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. వాటర్ ఆగిపోయిన పాయింట్స్, మూసి పరివాహక ప్రాంతాలు, హుస్సేన్ సాగర్ పై నిరంతరం నిఘా పెట్టామన్నారు ఆమ్రపాలి. అన్ని డిపార్ట్మెంట్ల అధికారులను అప్రమత్తం చేశామని చెప్పారు. సెప్టెంబర్ 2న భారీ వర్ష సూచన ఉన్నందున అధికారులను అప్రమత్తంగా ఉండాలని ఆదేశించామని చెప్పారు అమ్రపాలి. హిమాయత్ సాగర్,ఉస్మాన్ సాగర్ లో FTL కు చేరుకునేందుకు బాగా సమయం పడుతుందన్నారు .అయిన సరే మూసి పరివాహక ప్రాంతాల్లో ఉండే జనం ను అలెర్ట్ చేశామని చెప్పారు.

# రాష్ట్రవ్యాప్తంగా రెస్క్యూ ఆపరేషన్స్..శ్రమిస్తున్న ఫైర్ సేఫ్టీ టీమ్స్

**హైదరాబాద్ పెన్ పవర్:**రాష్ట్రవ్యాప్తంగా వానలు దంచికొడుతున్నాయి. గత మూడు రోజులుగా ఎడ తెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు నదులు, చెరువులు, కుంటలు, వాగులు పొంగిపొర్లు తున్నాయి. భారీవర్షాలతో పలుప్రాంతాల్లో వరదల్లో చిక్కుకుని ప్రజలను తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ క్రమంలో తెలంగాణ ప్రభుత్వం అలెర్ట్ అయింది..ఎన్డీఆర్ఎఫ్, డీఆర్ఎఫ్, ఫైర్ సేఫ్టీ సిబ్బందిని, అధికారులను అప్రమత్తం చేసింది..రాష్ట్రవ్యాప్తంగా సహాయక చర్యలు చేపట్టారు.. వరదల్లో చిక్కుకున్న ప్రజలను రక్షించేందుకు శ్రమిస్తున్నారు.



మహబూబాబాద్ జిల్లా బీమరాజుపల్లి, మరిపెడ, బంగ్లాలో వరదనీటిలో చిక్కుకున్న 9మందిని ఫైర్ సిబ్బంది కాపాడింది.. సూర్యాపేట జిల్లా కోదాడలో కూడా పలు వురు కాపాడారు రెస్క్యూ టీం సభ్యులు. కోదాడ ఎల్ ఐసీ ఆఫీస్ మెయిన్ రోడ్, కోదాడ బ్రిడ్జి దగ్గర , షిర్డీ సాయినగర్ లో దాదాపు 150 మందిని కాపాడి సురక్షిత ప్రాంతాలకు చేర్చారు. కోదాడ పరిధిలోని తొగురై గ్రామంలో వరద నీటిలో ఆగిపోయిన కారులోంచి ఇద్దరు వ్యక్తులను రక్షించారు ఫైర్ సిబ్బంది. కోదాడ చెరువు లో వరదల్లో చిక్కుకుపోయిన ఇద్దరిని బోట్ల ద్వారా రక్షించారు. మహబూబాద్ జిల్లాలో సూతరం తండా , ధర్మారంలో ఫైర్ డిపార్ట్ మెంట్ రెస్క్యూ టీం సక్సెస్ ఫుల్ పనిచేస్తోంది. సుమారు 100 మందిని సేఫ్ జోన్ కు తరలించారు. సీతారాం తండా, ధర్మారం గ్రామంలో సహాయక చర్యలు చేపట్టారు. మహబూబాబ్ జిల్లాలో వాగులు వంకలు పొంగిపొర్లుతుండటంతో ఫైర్ సిబ్బంది అలెర్ట్ అయింది. లోతట్టు ప్రాంత ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించడంతో శ్రమిస్తున్నారు ఫైర్ సిబ్బంది.

# వర్షంపై డప్పు సాటింపు

యాదాద్రి భువనగిరి: రాష్ట్ర వ్యాప్తంగా గత మూడు రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్న విషయం తెలిసిందే..నదులు, చెరువులు, వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి..కొన్నిచోట్ల చెరువులు తెగిపోయాయి..కొన్నిచోట్ల మత్తడి దుంకుతున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా కురుస్తున్న వర్షాలతో ఎక్కడికక్కడ జనజీవనం స్తంభించి పోయింది. రాష్ట్రంలోని శ్రీశైలం, నాగార్జున సాగర్, కాళేశ్వరం ప్రాజెక్టులు నిండు కుండలా తలపిస్తున్నాయి. అయితే రాష్ట్రంలో మరో మూడు రోజుల పాటు భారీ వర్షాలు కురువనున్నట్లు వాతావరణ శాఖ హెచ్చరికలతో రాష్ట్ర ప్రభుత్వం అలెర్ట్ అయింది.. స్కూళ్లకు సెలవులు ప్రకటించింది.. దీంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది.. అయితే భువనగిరి జిల్లా రామన్న పేటలో భారీ వర్షాలపై వినూత్న రీతిలో అలెర్ట్ చేశారు అక్కడి గ్రామ సర్పంచ్..



రానున్న మూడు రోజుల వర్షాలు ఉన్నందున్న రామన్నపేటలో డప్పు సాటింపు ద్వారా అలెర్ట్ చేశారు స్థానిక అధికారులు, గ్రామ సర్పంచ్.. పాత బడిన ఇండ్లలో ఉండకూడదని హెచ్చరించారు. కరెంట్ పోల్స్ దగ్గరకు వెళ్లొదని.. గ్రామంలో ఏదైనా అవాంఛనీయ సంఘటన జరగకుండా.. ఏదైనా ప్రమాదం సంభవించే పరిస్థితి ఉంటే వెంటనే గ్రామ పంచాయతీ, అధికారులకు తెలియజేయాలని డప్పు సాటింపు ద్వారా రామన్న పేట గ్రామ ప్రజలను అలెర్ట్ చేశారు.

# సాగర్ ఎడమ కాల్వకు గండి.. తీవ్ర భయాందోళనలో ప్రజలు

**హైదరాబాద్ పెన్ పవర్:** రాష్ట్రంలో గత మూడు రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఎడతెరిపి లేకుండా వర్షాలు పడుతుండటంతో రాష్ట్రంలోని ప్రాజెక్టులు, నదులు, కాలువలు, చెరువులు, కుంటలు, వాగులు, వంకలు పొంగి పొర్లుతున్నాయి. ఈ క్రమంలోనే సూర్యపేట జిల్లాలో ప్రవహించే సాగర్ ఎడమ కాల్వకు గండి పడింది. వరద ఉధృతి ఎక్కువై నడిగూడెం మండలంలోని

రామచంద్రపురం వద్ద సాగర్ ఎడమ కాల్వకు గండిపడింది. దీంతో వరద నీరు పంటపొలాల ద్వారా మెల్లగా గ్రామంలోకి చేరుకుంటుంది.కాల్వకు గండి పడి వరద నీరు రావడంతో గ్రామస్తులు తీవ్ర భయాందోళనకు గురి అవుతున్నారు. గండి పడే అవకాశం ఉందని గతంలో అధికారులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోలేదని స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గ్రామస్తుల సమాచారం అందుకున్న ఇరిగేషన్ అధికారులు హుటాహుటిన ఘటన స్థలానికి చేరుకుని సహాయక చర్యలు ప్రారంభించారు. వరద ఉధృతి ఎక్కువగా ఉండటంతో గండి పూడ్చివేత అధికారులు



ఛాలెంజింగ్ మారింది. ఏ క్షణాన ఏం జరుగుతోందోనని గ్రామస్తులు బిక్కుబిక్కుమంటున్నారు.

## కోరుట్ల మార్కెట్ కమిటీ ఛైర్మన్ ప్రమాణానికి హాజరైన ఎమ్మెల్యే వివేక్



**హైదరాబాద్ పెన్ పవర్:**జగిత్యాల జిల్లా కోరుట్ల మార్కెట్ కమిటీ ప్రమాణ స్వీకారానికి హాజరయ్యారు చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి, కోరుట్ల కాంగ్రెస్ ఇంచార్జి జువ్వాడి నర్సింగరావు. మార్కెట్ కమిటీ చైర్మన్ గా ప్రమాణం చేసిన అంజిరెడ్డితో పాటు పాలకవర్గ సభ్యులను అభినందించారు. ఈ సందర్భంగా వివేక్ వెంకటస్వామితో పాటు నర్సింగరావును పూలమాలతో సత్కరించారు నూతన పాలకవర్గ సభ్యులు.

మార్కెట్ కమిటీ చైర్మెన్ ప్రమాణ స్వీకారం రోజు వర్షం కురవడం శుభపరిణామం అన్నారు ఎమ్మెల్యే వివేక్. ఉప ప్రధాని అవుతాననుకుని కేసీఆర్ ఇతర రాష్ట్రాల్లో కోట్లు ఖర్చు పెట్టారని విమర్శించారు. గత ప్రభుత్వ హయాంలో రైస్ మిల్లర్లు రైతుల దగ్గర ముక్కు పిండి వసూల్ చేశారన్నారు. మిల్లర్ల దగ్గర బీఆర్ఎస్ నేతలు కమీషన్లు వసూలు చేశారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతు ప్రభుత్వమని చెప్పారు. రైతు రుణమాఫీ చేసి నిజమైన ప్రజా పాలన చూపించింది కాంగ్రెస్ సర్కార్ అని అన్నారు వివేక్.

## చిమిర్యాల వాగు ఉద్ధృతి... ఏపీ-తెలంగాణ సరిహద్దులో నిలిచిన వాహనాల రాకపోకలు

తెలుగు రాష్ట్రాల్లో భారీ వర్షాలు

పొంగిపొర్లుతున్న వాగులు

చిమిర్యాల, పాలేరు వాగుల ఉగ్రరూపం




**హైదరాబాద్ పెన్ పవర్:**చిమిర్యాల వాగు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో ఏపీ-తెలంగాణ సరిహద్దులో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. తెలుగు రాష్ట్రాల సరిహద్దు రామాపురం వద్ద చిమిర్యాల వాగు ఉగ్రరూపం దాల్చింది. కోదాడ దిగువన చిమిర్యాల వాగు, పాలేరు భీకరంగా ప్రవహిస్తున్నాయి.

కోదాడ నుంచి దిగువకు భారీగా వరద నీరు ప్రవహిస్తోంది. నల్లబండగూడెం వద్ద జాతీయ రహదారిపైకి వరద నీరు చేరింది. దాంతో చిమిర్యాల వద్ద జాతీయ రహదారిపై వాహనాలు నిలిచిపోయాయి. అంతర్రాష్ట్ర చెక్ పోస్ట్ వద్ద కిలోమీటర్ల కొద్దీ వాహనాలు నిలిచిపోయిన పరిస్థితి కనిపిస్తోంది.

నల్లబండగూడెం వద్ద పాలేరు వాగులో ఆర్టీసీ బస్సు చిక్కుకుపోయింది. బస్సులో ఉన్న 30 మంది ప్రయాణికులు సురక్షితంగా బయటికి రావడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

## వర్షం ఎఫెక్ట్: ఉప్పల్ బస్టాండ్ దగ్గర భారీ గుంత



**హైదరాబాద్ పెన్ పవర్:**ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో హైదరాబాద్ నగరంలోని పలు ప్రాంతాలు జలమయమయ్యాయి..రోడ్లు అస్తవ్యస్థంగా మారాయి. భారీ వర్షాలతో హైదరాబాద్ లో ని ఉప్పల్ బస్టాండ్ దగ్గర రోడ్డు కుంగిపోయి భారీ గుంత ఏర్పడింది.. నడిరోడ్డు పై గుంత ఏర్పడంతో వాహనాదారులు తీవ్ర ఇబ్బందులకు గుర య్యాయి.. అలెర్ట్ అయిన జీహెచ్ ఎంసీ అధికారులు కుంగినరోడ్డుతోపాటు గుంతను పూడ్చారు. రాత్రి నుంచి కురుస్తున్న భారీ వర్షాలతో పలు ప్రాంతాల్లో వర్షపు నీరు చేరింది.. హైదరాబాద్ నుంచి వరంగల్ వెళ్లే రహదారిపై ఉప్పల్ బస్టాండ్ దగ్గర నడిరోడ్డు పై పెద్ద గుంత ఏర్పడింది. రోడ్డు కుంగిం ది..వెంటనే స్పందించిన జీహెచ్ ఎంసీ అధికారులు స్పందించి గుంతను పూడ్చి రోడ్డును మరమ్మతు చేశారు.

మరోవైపు రాష్ట్రవ్యాప్తంగా కురుస్తున్న వర్షాలకు తెలంగాణ ప్రభుత్వం అధికారులను అలెర్ట్ చేసింది.. ఇందులో భాగంగా హైదరాబాద్ నగరంలో కంట్రోల్ రూంలను ఏర్పాటు చేశారు.ఫిర్యాదులు అందిన వెంటనే జీహెచ్ ఎంసీ అధికారులు, ఎలక్ట్రిసిటీ అధికారుల అలెర్ట్ అవుతున్నారు. సహాయక చర్యలు చేపడుతున్నారు.

## హైదరాబాద్ లో ఘోరం.. పాదచారులపైకి దూసుకొచ్చిన కారు.. యువతి మృతి




**హైదరాబాద్ పెన్ పవర్:**హైదరాబాద్ లోని ఎల్బీ నగర్లో ఘోరం జరిగింది. వనస్థలిపురం ఎన్జీఓ కాలనీలోని వివేకానంద పార్క్ ముందు చోటు చేసుకుంది ఈ దారుణం. ర్యాష్ డ్రైవింగ్ తో ఓ కారు పాదచారుల పైకి దూసుకొచ్చింది. ఈ ఘటనలో ఓ యువతి మృతి చెందింది. మితిమీరిన వేగంతో కారు దూసుకురావడంతో హయత్ నగర్ కి చెందిన సోని (21) కి తీవ్ర గాయాలయ్యాయి. ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తుండగా సోని మృతి చెందినట్లు తెలుస్తోంది. ర్యాష్ డ్రైవింగ్ తో యువతి ప్రాణాలు బలిగొన్న వ్యక్తిని పట్టుకొని పోలీసులకు అప్పగించారు స్థానికులు. డ్రైవర్ ను అదుపులోకి తీసుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### భారీ వర్షాలు.. తెలంగాణకు 9 ఎన్డీఆర్ఎఫ్ బృందాలు

**హైదరాబాద్ పెన్ పవర్:**తెలంగాణలో కురుస్తున్న భారీ వర్షాల పరిస్థితిపై అమిత్ షా దృష్టికి తీసుకెళ్ళామని చెప్పారు కేంద్రమంత్రి బండి సంజయ్. ఖమ్మం జిల్లా పరిస్థితిని కూడా అమిత్ షాకు వివరించినట్లు చెప్పారు. ఖమ్మం జిల్లాలో 110 గ్రామాలు ముంపునకు గురవడంతో పాటు ప్రకాశ్ నగర్ లోగుట్టపై పలువురు వరదల్లో చిక్కుకున్నట్లు చెప్పామన్నారు.

# జలదిగ్బంధంలో ఖమ్మం..డ్రోన్ విజువల్స్



**హైదరాబాద్ పెన్ పవర్:**ఎడతెరిపిలేని వానలు..పొంగిపొర్లుతున్న నదులు, వాగులు, చెరువులు..గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు కాలనీలన్నీ నీటి మునిగాయి. ఎక్కడ చూసినా నీళ్లే..ఇండ్లలో మోకాల్లోతు నీళ్లు.. చెరువులను తలపిస్తున్న కాలనీలు..పాలేరు వాగు ఉగ్రరూపం..చెరువుల్లా కాలనీలు..విరిగిన పడినచెట్లు..కొట్టుకుపోతున్న ప్రజలు.. ఇదీ ఆదివారం నాటి ఖమ్మ పట్టణం దుస్థితి.. డ్రోన్ ద్వారా తీసిన విజువల్స్.. భారీ వర్షాలకు ఖమ్మం పట్టణ పరిస్థితికి అద్దంపడుతున్నాయి.

గత మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు ఖమ్మం జిల్లాలో మున్నేరు వాగు ఉగ్ర రూపం దాల్చింది. ప్రకాశ్ నగర్ వద్ద డేంజర్ లెవల్లో మున్నేరు ప్రవహిస్తోంది. దీంతో ఖమ్మం పట్టణంలోని ఇండ్లలోకి భారీగా వరద నీరు వచ్చి చేరింది. ఇళ్ల మధ్య నుంచి మున్నేరు వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది.. పలు గ్రామాలకు రాకపోకలు బంద్ అయ్యాయి. దీంతో ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ప్రకాశ్ నగర్ వద్ద మున్నేరు వాగు గోదావరి నదిని తలపిస్తోంది.

మున్నేరు వాగు ఉధృతంగా ప్రవహిస్తుండంతో ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం నాయికన్ గూడెం వద్ద ముగ్గురు యువకులు వరదల్లో చిక్కుకున్నారు. సిమెంట్ బ్రిక్స్ తయారీ కేంద్రం ఉన్నా ఇల్లును వరద చుట్టుముట్టడంతో ముగ్గురు యువకులు ఇంటిపైకి ఎక్కారు.

బాధితులతో మాట్లాడిన పొంగులేటి..వారికి ధైర్యం చెప్పారు.హెలికాప్టర్లు పంపించేందుకు ప్రయత్నించారు..కానీవాతావరణ సహకరించకపోవడంతో సాధ్యం కాలేదు.. అయితే డ్రోన్ ద్వారా బాధితులకు సేఫ్టీ జాకెట్లు పంపించారు.అయితే ఇంతలోనే వరద ఉధృతి పెరిగి ఇంటి గోడ కూలిపోయిందని మంత్రి పొంగులేటి మీడియాతో చెప్పారు.. లైఫ్ జాకెట్లు ఉన్నాయి.. వారు క్షేమంగా బయటికి రావాలని కోరుకుంటున్నానని కంటనీరు పెట్టుకున్నారు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి.

# తెలంగాణలో వర్షాలకు 9 మంది మృతి



**హైదరాబాద్ పెన్ పవర్:**తెలంగాణలో భారీ వర్షాలకు జనజీవనం స్తంభించిపోతుంది. సెప్టెంబర్ 1 మధ్యాహ్నం ఒంటి గంట వరకు రాష్ట్ర వ్యాప్తంగా తొమ్మిది మంది మృతి చెందారని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ప్రకటించారు.

గత మూడు రోజులుగా ఎడ తెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు నదులు, చెరువులు, కుంటలు, వాగులు పొంగిపొర్లుతున్నాయి. భారీవర్షాలతో పలుప్రాంతాల్లో వరదల్లో చిక్కుకుని ప్రజలను తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ క్రమంలో అలర్ట్ అయిన ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా సహాయక చర్యలు చేపడుతోంది. వరదల్లో చిక్కుకున్న ప్రజలను రక్షించేందుకు శ్రమిస్తున్నారు అధికారులు.

మహబూబాబాద్ జిల్లా బీచురాజుపల్లి, మరిపెడ, బంగ్లాలో వరదనీటిలో చిక్కుకున్న 9మందిని ఫైర్ సిబ్బంది కాపాడింది.. సూర్యాపేట జిల్లా కోదాడలో కూడా పలు వురు కాపాడారు రెస్క్యూ టీం సభ్యులు. కోదాడ ఎల్ ఐసీ ఆఫీస్ మెయిన్ రోడ్, కోదాడ బ్రిడ్జి దగ్గర , షిర్డీ సాయినగర్ లో దాదాపు 150 మందిని కాపాడి సురక్షిత ప్రాంతాలకు చేర్చారు. కోదాడ పరిధిలోని తొగుర్రై గ్రామంలో వరద నీటిలో ఆగిపోయిన కారులోంచి ఇద్దరు వ్యక్తులను రక్షించారు ఫైర్ సిబ్బంది. కోదాడ చెరువు లో వరదల్లో చిక్కుకుపోయిన ఇద్దరిని బోట్ల ద్వారా రక్షించారు. మహబూబాద్ జిల్లాలో సూతరం తండా , ధర్మారంలో ఫైర్ డిపార్ట్ మెంట్ రెస్క్యూ టీం సక్సెస్ ఫుల్ పనిచేస్తోంది. సుమారు 100 మందిని సేఫ్ జోన్ కు తరలించారు.

## మున్నేరు వాగు ఉగ్రరూపం..వరదల్లో చిక్కుకున్న ముగ్గురు యువకులు

**హైదరాబాద్ పెన్ పవర్:**గత మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు ఖమ్మం జిల్లాలో మున్నేరు వాగు ఉగ్ర రూపం దాల్చింది. ప్రకాశ్ నగర్ వద్ద డేంజర్ లెవల్లో మున్నేరు ప్రవహిస్తోంది. దీంతో ఖమ్మం పట్టణంలోని ఇండ్లలోకి భారీగా

వరద నీరు వచ్చి చేరింది. ఇళ్ల మధ్య నుంచి మున్నేరు వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది.. పలు గ్రామాలకు రాకపోకలు బంద్ అయ్యాయి. దీంతో ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ప్రకాశ్ నగర్ వద్ద మున్నేరు వాగు గోదావరి నదిని తలపిస్తోంది. మున్నేరు వాగు ఉధృతంగా ప్రవహిస్తుండంతో ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం నాయికన్ గూడెం వద్ద ముగ్గురు యువకులు వరదల్లో చిక్కుకున్నారు. సిమెంట్



బ్రిక్స్ తయారీ కేంద్రం ఉన్నా ఇల్లును వరద చుట్టుముట్టడంతో ముగ్గురు యువకులు ఇంటిపైకి ఎక్కారు. సహాయం కోసం ఎదురు చూస్తున్నారు.